క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



మరికల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆర్డీఓ రాంచందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, విద్యార్థులకు కుల, ఆదాయ తదితర ధృవీకరణ పత్రాలు జారీలో ఆలస్యం చేస్తున్నట్లు తెలియడంతో తనిఖీ చేసి అధికారులతో ఆరా తీశారు. మరికల్‌కు నాలుగు కిలోమీటర్ల దూరంలో తహసీల్దార్ కార్యాలయం ఉండటంతో ఇంటర్‌నెట్‌తో పాటు విద్యుత్ సమస్య ఉండడంతో ధృవీకరణ పత్రాల జారీలో ఆలస్యం అవుతున్నట్లు వివరణ ఇచ్చారు. కార్యాలయానికి వచ్చే ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా సమస్యను త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు.

బీటీ రోడ్డు పనులకు భూమి పూజ



మద్దూరు: మండంలోని హన్మనాయక్ తాండ నుంచి దేన్యానాయక్ తాండ వరకు 1.8 కిలో మీటర్ల బీటీ రోడ్డు పనులకు పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా గురువారం భూమి పూజ నిర్వహించారు. రూ.2.6 కోట్ల సీడీఎఫ్ నిధులతో బీటీ రోడ్డు పనులను చేపట్టినట్లు పీఆర్ డిప్యూటీ ఈఈ విలోక్ తెలిపారు. ఆరు నెలల్లో రోడ్డు పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, కాంగ్రెస్ నాయకులు రాజు, అనిల్ నాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి రూరల్: కోస్గి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మండల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఫీడర్ పరిధిలోని అన్ని గ్రామాలలో విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

మద్దూరు: మద్దూరు 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పల్లెర్ల, దమ్‌గాన్ పూర్, దోరేపల్లి గ్రామాల విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అలాగే 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని మద్దూరు విద్యుత్ ఏఈ నిరంజన్ దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామాల పరిధిలోని విద్యుత్ లైన్ల వెంబడి చెట్ల కొమ్మలను నరకడం అలాగే లూజు వైర్లను సరి చేస్తుండడంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తునట్లు పేర్కొన్నారు.

అచ్చంపల్లిలో నీటి సమస్యను పరిష్కరించండి



మద్దూరు: మండలంలోని అచ్చంపల్లి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు ఉసేనప్ప, సాయప్ప, అంజి, గోవిందు ఎంపీడీఓ నర్సింహారెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. మిషన్ భగీరథ నీరు సరఫరాలో లోపాల కారణంగా గ్రామానికి 15 రోజుల నుంచి నీటి సరఫరా జరగడం లేదన్నారు. నీటి సరఫరాను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓను కోరారు.

జింకపిల్ల అప్పగింత



మాగనూర్ (మక్తల్): మక్తల్ మండలం గొల్లపల్లి గ్రామ శివారులో కురుమూర్తి అనే రైతు పొలంలో పని చేస్తుండగా జింక పిల్ల దొరికింది. కుక్కల అరుస్తుండడంతో అటుగా వెళ్లి చూడగా జింక పిల్ల కనిపించడంతో దానిని పట్టుకొని కుక్కల బారి నుంచి కాపాడి మక్తల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించాడు. పోలీస్ సిబ్బంది అటవీ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు జింకపిల్లను స్వాధీనం చేసుకున్నారు.

కార్యాలయాలకు సొంత భవనాలు కరువు

- మండలం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తి
- నేటికీ ప్రభుత్వ భవనాలు లేక ఇబ్బందులు



ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

కృష్ణా: కృష్ణా మండలం మాగనూర్ మండలం నుంచి వేరు పడి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా నేటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు కనీసం సొంత భవనాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9 గ్రామ పంచాయతీలతో 2016లో కృష్ణా మండలాన్ని ఏర్పాటు చేశారు. ఆ తరువాత మరో 4 గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. ప్రస్తుతం మొత్తం 13 గ్రామ పంచాయతీలు కృష్ణా మండలంలో కొనసాగుతున్నాయి. ఈ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, ఎంపీడీఓ కార్యాలయం ఎమ్మార్సీ కార్యాలయంలో అదే విధంగా ఉపాధి హామీ (ఈజీఎస్) కార్యాలయం కూడ ఇదే ఎమ్మార్సీ కార్యాలయంలో కొనసాగుతుంది. అదే విధంగా ఐకేపీ మహిళా సమాఖ్య కార్యాలయాన్ని గ్రామ పంచాయతీలో వ్యవసాయశాఖ కార్యాయం రైతు వేదికలో కొనసాగిస్తున్నారు. దీంతో అటు అధికారులు ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో అధికారులు మాత్రం ఏ సమావేశాలు అయిన మాగనూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించి మమ అనిపిస్తున్నారు. అలాగే ఇటీవల ఈ మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు కాగా భవన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. అలాగే ఈ మండలం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ ప్రభుత్వ ఆస్పత్రి లేకపోవడంతో ప్రజలు చిన్న జబ్బు చేసినా వేరే ప్రాంతాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాల్సి వస్తుంది. దీంతో పేదల జేబుకు చిల్లు పడుతుంది. మండలంలో అన్ని శాఖల అధికారులు ఉన్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కృష్ణా మండల కేంద్రంపై దృష్టి సారించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన ఎంపీడీఓ కార్యాలయం

వేధిస్తున్న సిబ్బంది కొరత

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు అటెండర్లు, ఉపాధిహామీ శాఖలో ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, 7 గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, 2 గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, తహసీల్దార్ కార్యలయంలో డీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా ప్రతి శాఖలో సిబ్బంది కొరత ఉండడంతో మండలం అభివృద్ధి చెందాలంటే ఎలా సాధ్యమవుతుందని అధికారులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు మండలాన్ని ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగున్నా ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. అధికారులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలం కావడంతో పాటు ఉన్న అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు.

మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలి



ముడుమాల్‌లో మెయిన్ రోడ్డు ప్రక్కన బెల్ట్ షాప్

కృష్ణా: మండలంలోని జాతీయ రహదారుల పక్కనే దాబాల ముసుగులో బెల్టుషాప్‌లు నిర్వహిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు మందు విక్రయిస్తున్నట్లు సమీప గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొన్ని దాబాలు అయితే బార్ అండ్ రెస్టారెంట్‌ల వలే కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి అయిందంటే చాలు దాబాల ముందు వందలాది మంది మందుబాబులు రోడ్డు పక్కనే కుర్చీలు వేసుకొని మందు తాగుతున్నారు. గ్రామాల్లో అమ్ముకునే బెల్టుషాప్‌లపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేస్తున్నారు కానీ జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాల్లో దాడులు నిర్వహించకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మద్యం విక్రయిస్తున్న దాబాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



భూమి పూజ చేస్తున్న నాయకులు

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ గుండుమాల్ మండల అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. గురువారం గుండుమాల్ మండల పరిధిలోని బలుబద్రాయపల్లి గ్రామం నుంచి ఓడ్డుకిందితాండ వరకు రూ. 2.73 కోట్లతో అలాగే ముదిరెడ్డిపల్లి నుంచి బండారు లక్ష్మయ్య కాలనీ వరకు రూ.65 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు అన్ని రంగాలలో గుండుమాల్ మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్‌రెడ్డి , మధుకర్‌రావు, అచ్యుతారెడ్డి, జాజం వెంకటేష్, రవి ఉన్నారు.

శిక్షణ శిబిరాలతో నైపుణ్యం వెలికితీత



విద్యార్థులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న యంఈఓ, కమిషనర్

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈఓ శంకర్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల చిత్రలేఖనం , డ్యాన్స్, అల్లికలు, యోగాపై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనర్‌లు జ్యోతి, విజయలక్ష్మి ,రాఘవేందర్, హరికృష్ణ ,ఉపాధ్యాయులు శివరాములు, రవిప్రకాష్, రాజేందర్‌రావు , నాగరాజు ఉన్నారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించాలి



వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న జీఎస్ గోపి

అమరచింత: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పనులకు వెళ్తున్న రైతు కూలీలకు ఉపాధి కల్పించాలని, వారికి ఏడాదికి రూ.12,500 చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర చెరుకు సంఘం అధ్యక్షుడు జీఎస్.గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. ఈ నెల 20 జరిగే సార్వత్రిక సమ్మెకు ప్రతి శ్రామికుడు, కూలీలు సంపూర్ణంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ గురువారం మండలంలోని కొంకన్‌వానిపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈమేరకు ఉపాధి హామీ కూలీలతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దొడ్డు రకం వరిధాన్యానికి కూడా బోనస్‌గా రూ.500 చెల్లించాలని కోరారు. మిల్లర్లు తేమ, తాలు, చెత్త పేరుతో క్వింటాకు 8 కిలోల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించేందుకు ట్రాన్స్‌పోర్ట్, హమాలీ వ్యవస్థను ఏర్పాటు చేయ్యాలని కోరారు. అకాల వర్షాల కారణంగా రైతులు ధాన్యాన్ని కాపాడుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, అంజిరెడ్డి, మొగిలన్న, మోహన్, నాగరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

అమరచింత: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం తహసీల్దార్ రవికుమార్ యాదవ్‌తో కలిసి డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ 28 మందికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తారన్నారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మహంకాళి విష్ణు, తిరుమలేష్, పోసిగిగారి విష్ణు, తౌఫిక్ పాల్గొన్నారు.

22న ఉచిత కంటి వైద్య శిబిరం

నారాయణపేట రూరల్: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఈనెల 22న లయన్స్ క్లబ్ ఆ ద్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు క్యాంపు ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్ నగర్ కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. 50 సంవత్సరాలు పైబడిన వృద్ధులు తమ ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులలో ఏదైనా ఒకటి తీసుకొని శిబిరంలో పాల్గొనాలని కోరారు.

జూనియర్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం



కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు గ్రామంలో ఏర్పడిన జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలను కళాశాల సిబ్బంది గురువారం ప్రారంభించారు. నూతనంగా ఏర్పడిన కళాశాల ప్రిన్సిపాల్‌గా వరంగల్ జిల్లా ఆర్‌జేడీపీఈ అంబాజీ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సా ధించిన మండలంలోని గ్రామీణ విద్యార్థులు కళాశాలలో చేరాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే క ళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న అంబాజీని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి సన్మానించారు.

'బక్రీద్' శాంతియుతంగా జరుపుకోవాలి



ఊట్కూరు: బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ రామ్‌లాల్ సూచించారు. గురువారం ఊట్కూరు పోలీసు స్టేషన్‌లో బక్రీద్ సందర్భంగా ముస్లింలు, విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ నాయకులతో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. గోవుల అక్రమ రావాణాకు అరికట్టడానికి చెక్ పోస్టుల దగ్గర తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణంరాజు, నాసిర్‌ఖాన్, పెద్దలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపుపై నిఘా పెంచాలి

మాగనూర్: మక్తల్ నియోజకవర్గంలో ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. బూడిద చాటున ఇసుకను అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కోడుతున్నారు. కృష్ణ మండలంలోని కృష్ణ నది నుంచి పలు ప్రాంతాలలో రాత్రి సమయంలో పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. భారీ ఎత్తున ఇసుక అక్రమ రవాణ జరుగుతున్న అధికారులు దృష్టి సారించడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక తరలింపుపై నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అవగాహన సదస్సుపై ఆర్టీఓకు వినతి

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించాలని ఆర్టీఏ సభ్యుడు రాజేష్ కోరారు. ఈ మేరకు గురువారం ఆర్టీవో మేఘా గాంధీకి వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, కమర్షియల్ ట్రాక్టర్లు పెద్ద ఎత్తున ఉన్నాయని, వాటిని ఇష్టానుసారంగా ఉపయోగించడంతో రవాణా అధికారుల తనిఖీల్లో ఫైన్ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అవగాహన రాహిత్యంతో వాహనాలకు పెనాల్టీలు కట్టి డబ్బు వృధా చేసుకుంటున్నారని, సక్రమమైన పద్ధతిలో వాటి ఉపయోగానికి రైతులు, వాహన యజమానులు, డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని కోరారు.

శ్రీశైలం తరలివెళ్లిన భక్తులు



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్ర సమీపంలోని పగిడిమరి రోడ్డులో గల శ్రీ వీరధర్మజ మాతా మాణికేశ్వరి వ్యాస ఆశ్రమం నుంచి భక్తులు శుక్రవారం శ్రీశైలం తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు బండి శివరాం రెడ్డి వాహన శ్రేణికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. శ్రీశైలంలో జరిగే కుంభోత్సవాలలో జరిగే జీవహింసను మాతా మాణికేశ్వరి అడ్డుకుని నిలుపుదల చేశారని గుర్తు చేశారు. అలా అమ్మవారి ఆజ్ఞ మేరకు ఏటా జరిగే కుంభోత్సవాలకు భక్తులు తరలి వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

సమ్మర్ క్యాంపులో విద్యార్థుల ప్రతిభ



నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో విద్యార్థులు ప్రతిభ చూపారు. రంగు రంగు కాగితాలతో ఆకర్షణీయమైన బొమ్మలు తయారు చేశారు. అదే విధంగా అద్భుత చిత్రాలు గీసి ఔరా అనిపించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ భాను ప్రకాష్, ఉపాధ్యాయులు భారతి, విజయ, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వాల్మీకి బోయల సమస్యల పరిష్కారానికి కృషి



నర్వ: వాల్మీకి బోయల సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని జిల్లా ప్రధాన కార్యదర్శి పసుల నీరజ్ అన్నారు. గురువారం ఎల్లంపల్లి గ్రామంలో నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మచ్చ అంజన్న, ఉపాధ్యాక్షుడిగా చిన్న ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా పెద్ద అంజన్న, కార్యదర్శిగా ఉంద్యాల శ్రీను, ప్రచార కార్యదర్శిగా సుదర్శన్, కోశాధికారిగా గోవిందు, కార్యవర్గ సభ్యులుగా కిష్టన్న, కృష్ణ, అంజప్ప,మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను జిల్లా, మండల నాయకులు శాలువాలతో సత్కరించారు.

సంకీర్తనల ముద్రణకు ఆర్థికసాయం



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి సంకీర్తనల ముద్రణకు మండల కేంద్రానికి చెందిన గంజి బాల్‌రాజు ఆర్థిక సాయం చేశారు. గురువారం కురుమూర్తి గ్రామంలో హనుమాన్ భజన మండలి సభ్యుడు హరినాథ్‌కు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ కురుమూర్తి స్వామి చరిత్రను దేశమంతట చాటడమే లక్ష్యం అన్నారు. అందుకు సంకీర్తనలను ముద్రించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తుడు విమలన్న, పలువురు ఉన్నారు.

గడ్డివాము దగ్ధం



అయిజ: మండలంలోని ఉప్పల క్యాంప్‌లో గురువారం అర్ధరాత్రి ఓ గడ్డివాము దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు బడేసాబ్‌కు చెందిన గడ్డివాముకు నిప్పంటించడంతో గడ్డివాము మొత్తం కాలిపోయింది. గ్రామస్తులు గ్రామ పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌తో నీళ్ల చల్లి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. చివరికి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు జేశారు. అయితే అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. గడ్డి వాము విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరాడు.

బస్సులో తప్పిపోయిన కుమారుడు అప్పగింత



జడ్చర్ల టౌన్: మరికల్ స్టేజి వద్ద కుమారుడితో కలిసి బస్సు ఎక్కిన తల్లి పొరపాటున మహబూబ్ నగర్ బస్టాండ్‌లో దిగింది. కుమారుడు మాత్రం బస్సులోనే ఉండిపోయాడు. దీంతో కలవరం చెందిన ఆమె మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో కానిస్టేబుల్ బస్సు వివరాలతో పాటు బాలుడి ఆనవాళ్లను జడ్చర్ల బస్టాండ్ స్టేషన్ మేనేజర్ జయరాజుకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న అతడు ట్రాఫిక్ గైడ్ వెంకటయ్య, నర్సింహులుతో కలిసి బస్సు నంబరు ఆధారంగా కుమారుడిని గుర్తించారు. తరువాత తల్లి జడ్చర్ల బస్టాండ్‌కు వెళ్లగా ఆమెకు అప్పగించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కోస్గి రూరల్: భార్యతో గొడవ పడి వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై బాల్‌రాజు కథనం మేరకు.. గుండుమాల్ మండల పరిధిలోని అమ్లికుంట గ్రామానికి చెందిన వేపూరి కృష్ణారెడ్డికి పగిడాల గ్రామానికి చెందిన శ్వేతతో ఏడాది క్రితం వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన కృష్ణారెడ్డి ఈ నెల 14వ తేదీ నుంచి కనబడకుండా పోయాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కృష్ణారెడ్డి అన్న మోహన్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేసీబీ, ట్రాక్టర్ స్వాధీనం: కేసు నమోదు

రాజాపూర్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను ఫిల్టర్ చేస్తుండటంతో రాజాపూర్ పోలీసులు గురువారం జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాజాపూర్ శివారులోని దుందుభీ వాగునుంచి అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తుండగా సమాచారం తెలుసుకున్న బ్లూకోర్టు విధులు నిర్వహిస్తున్న కిరణ్‌భార్గవ్, ఖాజాకలీమొద్దీన్‌లు అక్కడి వెళ్లారు. జేసీబీ డ్రైవర్ భీమగళ్ల శ్రీశైలం, ట్రాక్టర్ డ్రైవర్, నర్సింహులును అనుమతి పత్రాలు కోరగా చూపించలేదు. దీంతో జేసీబీ, ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి నిందితులపై కేసు నమోదు చేశారు.

బృహత్ వన మొక్కలు వాడుముఖం



పీజేపీ క్యాంపు సమీపంలోని బృహత్ వనంలో మొక్కల పరిస్థితి

అమరచింత: మండలానికో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షించే చర్యలు తీసుకున్న అధికారులు.. ప్రస్తుతం వాటికి నీరు అందించలేకపోతున్నారు. దీంతో నాటిన పదివేల మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి. మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు క్యాంపు సమీపంలో నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేసిన బృహత్ పల్లెప్రకృతి వనంలో పదివేల మొక్కలు నాటి సంరక్షించారు. ప్రస్తుతం ఈజీఎస్ ద్వారా మెంటెనెన్స్ గడువు పూర్తయిందని పంచాయతీకి సంరక్షణ బాధ్యతలు అప్పగించారు. రోజువారి మొక్కలకు నీటిని అందించలేక పోవడంతో అవి ఎండుపుల్లలుగా దర్శనమిస్తున్నాయి. వీటితో పాటు సంపద వనాల పరిస్థితి సైతం అదే విధంగా తయారయ్యింది.